

# కన్నీటి కెరటాలు

**- మోచర సత్య**

కచేరీలు కూడా చేసే స్థాయి వచ్చిందామెకు. అయినింటి కోడలు కచేరీలు చెయ్యటమేమిటని నోళ్ళు నొక్కుకున్న లోకుల మాటలు రామచంద్రని మార్చలేదు. కళ ... కళని ఆరాధించాలి, ఆనందించాలి...అందరికీ అందించాలి...అదే ఆయన తపన.

అంతటి అందమూ, గాన మాధుర్యమూ ఇచ్చిన ఆవిడకి దేవుడు ఆరోగ్యం మాత్రం ఇవ్వలేదు. బలహీనమైన ఆవిడ శరీరంలో గర్భం నిలిచేది కాదు. అయిదారు ఎబార్షన్ల తరవాత ఇక ఆమెకు గర్భం నిలవదు, తను పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించుకుంటే ఆమెకు కనీసం శారీరకంగానూ, మానసికంగానూ హింస తప్పుతుందనే ఆలోచన రామచంద్ర మనసులో రూపం ఏర్పరుచుకుంటూ ఉండగా శారద కడుపున పడటమూ, ఆసారి గర్భం నిలవటమూ జరిగాయి. శారద పుట్టేటప్పటికి ఆమె తల్లికి ఇరవై ఎనిమిదేళ్ళు. శారద పురిట్లో రుమాటిజమ్ వచ్చి అప్పటికే ఊగిసలాడుతున్న ఆవిడ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. గుండెదడా, ఆయాసమూ ఎక్కువై సంగీత సాధనా, తంబురా మూల చేరాయి. అన్ని హంగులూ ఇచ్చిన దేవుడు ఒకే దెబ్బతో ఏ ఒక్కటీ అనుభవించటానికి వీల్లేకుండా చేశాడని వాపోయే ఆవిడ మనోవ్యథ చూడలేక కొంతా, ఆవిడ ఆరోగ్యం మూలాన దాంపత్య జీవితం అనుభవించలేక తిరుగుబాటు చేసే ఇంద్రియాలని జయించటానికి మరో మార్గం లేక కొంతా, పూర్తిగా తలమునకలయ్యేంత పనిని మీద వేసుకుని అందులో

కాంతి తెచ్చుకోవటం మొదలెట్టాడు రామచంద్ర. హైస్కూల్లో ఉండగానే తల్లి పడుతున్న చిత్రహింసనీ, దానివల్ల తండ్రి మానసికంగానూ, శారీరకంగానూ కూడా అనుభవిస్తున్న వేదననీ అర్థం చేసుకుంది శారద. అనారోగ్యం వల్ల తల్లీ, పనిలో తలమునకలయ్యే తండ్రీ ఆ పిల్లకి అనుకున్నంత ప్రేమాభిమానాలు ఇవ్వలేకపోయినా, వాళ్ళ మనసులో ప్రేమకి కొరతలేదని అర్థం చేసుకో గలిగిన శారద సున్నిత మనస్తత్వంతో వాళ్ళిద్దరికీ పట్టుకొమ్మయింది. శారద పక్కింట్లో రాజశేఖరం కుటుంబం ఉంటూండేవారు. చిన్నతనంనుంచి కలిసి పెరిగిన వాళ్ళిద్దరి మధ్యా అతి సున్నితమైన స్నేహపు బంధం ఏర్పడింది. తన ఒంటరితనం అతని సన్నిధిలో మరిచిపోగలిగేది. శారద సున్నిత మనస్తత్వాన్ని ఎంతగానో ఆరాధించేవాడు శేఖర్. మరి గుండెల్లో భరించలేని గుబులు పేరుకున్నప్పుడు అతని దగ్గర ఆ బాధ వెళ్ళబోసుకునేది. ఆమె కుటుంబ చరిత్ర అంతా ముక్కలు ముక్కలుగా ఆ విధంగానే సేకరించాడు శేఖర్.

ఇంటర్ తరవాత వెల్లూరులో సి. ఎమ్. సి.లో మెడికల్ కోర్సులో జాయి నయి వెళ్ళిపోయాడు శేఖర్. శారద గుంటూరులోనే బి. ఏ. లో జాయి నయింది. శేఖర్ సెలవులకి వచ్చినప్పుడే ఆమెను చూట్టం అయ్యేది. ఆమె బి. ఎ. ఫైనలియర్లో ఉండగా శారద తల్లి పోయింది. మళ్ళీ రామచంద్ర జీవితంలో మరో సుడి. ఆవిడ గూర్చి ఆయన తపించిపోవడం చూసిన వాళ్ళెవరూ కంట తడి పెట్టకుండా ఉండలేకపోయారు.

భార్య ఉన్నంతవరకూ ఆవిడ మనస్సు కష్టపడుతుందని ఆయన అదుపులో పెట్టుకున్న కోర్కెలు ఇప్పుడు విజృంభిం చాయి. ఆవిణ్ణి మరచిపోవటానికి అదో ఆలంబనే అయింది. వ్యసనాలు దయ్యా లవి తీరంతో ఆయన్ని దుమ్మెత్తిపోసినా, శారద మాత్రం ఆయన్ని అపార్థం చేసుకోలేదు. ఒక్కొక్కప్పుడు శారద ఒడిలో తలపెట్టి పసిపిల్లాడిలా ఏడ్చేవా డాయన.

శేఖర్ ఫైనల్ ఇయర్లో ఉండగా శారదకి పెళ్ళయింది—ఆమె చదువుకున్న కాలేజీలోనే. బెజవాడనుంచి వచ్చి లెక్చరర్గా చేరిన కృష్ణమూర్తితో. అంద మైన శారదని కళ్ళతో వెంటాడే మనస్సు న్నా మరిపించాడు కృష్ణమూర్తి. తన తల్లి మీద తండ్రికున్న లాంటి ఆరాధనే కృష్ణమూర్తి కళ్ళలో చూసిన శారద మొట్టమొదటిసారిగా కిలకిలా నవ్వి ఆనంద సాగరంలో ఈదులాడింది. అయితే, ఆ సంతోషం ముచ్చటంతా పెరెన్నియల్

## జీవితం

మనిషి పుట్టిన ముహూర్తానికి విలువ ఉన్నది. చచ్చిన ముహూర్తానికి విలువ ఉన్నది. ఆ రెండు ముహూర్తాల మధ్య కాలం మహత్తరమైంది. దాని విలువ గ్రహించగలవాడు వివేకవంతుడే.

—రిచ్మండ్

కాలేదు. కుంటలో నీరు సూర్యుడి భగ్గుమనే వేడికి ఇగిరిపోయినట్టే ఇగిరి పోయింది శారద సంతోషం, కృష్ణమూర్తి అసలు తత్త్వం బయటపడగానే. కళా హృదయుడూ, సంస్కారవంతుడూ అయిన రామచంద్రకీ, ఆ రెండూ లోపించిన కృష్ణమూర్తికీ సామ్యమే లేకపోయింది. పెరిగింది ఒక సంస్కృతి, అడుగు పెట్టింది ఇంకో వాతావరణమూ అయి ఆ రెండింటికీ సామ్యం కుదుర్చుకో లేక నలిగిపోయింది శారద. సెలవుల్లో కృష్ణమూర్తి ఇంటికి వెళితే అక్కడి వాళ్ళ ప్రవర్తన ఆమెకి వెగటు కలిగించేది. ఆవిడ అత్తగార్కి ఆడవాళ్ళు వంట చెయ్యటానికీ, పడుకోవటానికీ తప్ప మరి దేనికైనా పనికొస్తారనికాని, వాళ్ళకి ఓ మనసు ఉందని కాని అనిపించేది కాదు. కృష్ణమూర్తి కూడా అదే మూసలోంచి వచ్చేడు మరి. రామచంద్ర అందాన్ని కళా హృదయంతో ఆరాధిస్తే, కృష్ణ మూర్తి కామ హృదయంతో ఆరాధిం చాడు. శారద సున్నిత మనస్తత్వం అతనికి అర్థం కానూ లేదు. అర్థం చేసుకోవలసిన అవసరమూ అతనికి కను పించలేదు. పైగా ఆమెకి అసలు ఓ మనస్సు ఉండటమే అతనికి మహాపాపంగా కనుపించేది. కాని, ఉంది కనక, దానితో కూడా ఆమె శరీరంతోలానే ఆడటం నేర్చుకున్నా డతను.

"నీ తల్లికి సంగీతం నేర్పడానికి ఆ మహా విద్వాంసులంతా ఊరికేనే వచ్చేవా రేమిటి? అసలు మీ నాన్నకి మొదటి నుంచీ సెక్స్ క్రేజ్ ఎక్కువ. వాళ్ళతో ఆవిణ్ణి తార్చి చూసి ఆనందించడం ఆయన సైకాలజీ. నీకేం పోయింది? ఇంట్లో కూర్చున్నావు. బయట తిరిగే వాణ్ణి నేను. ఊళ్ళో అంతా మీ అత్తగా రిలాంటిది, మామగా రిలాంటివాడంటూ ఉంటే తల తీసేసినట్టుంది నాకు" అని ఆమెని సాధించేవాడు.

"అలాటి తల్లికీ, తండ్రికీ పుట్టేవు. వ్యభిచారం నీ రక్తంలోనే ఉండి ఉండాలి" అని వేధించి, ఆమె గింజుకుంటూ ఉంటే ఆనందించేవాడు. తన తల్లినీ, తండ్రినీ అలా అంటూ ఉంటే భరించలేక ఎప్పు డైనా తిరగబడితే చితక తన్నేవాడు. తండ్రికి తెలిస్తే ఆయన బాధపడతాడని కిమ్మనకుండా పడి ఉండేది. సెలవుల్లో శేఖర్ వచ్చినప్పుడు వీలు చూసుకుని అతనితో చెప్పుకుని ఏడ్చి కాస్త ఆరాటం తీర్చుకొనేది. ఆమె ముఖంగానూ, తన తల్లిద్వారానూ ఆ పిల్ల బాధలు తెలిసి, అశక్తతతో పిడికిళ్ళు బిగించే వాడు శేఖర్. అంతకన్నా ఏం చెయ్యగలడు?

న్యూరాలజీ, సైకోథెరపీ అతన్ని ఆక ర్షించేయి. వాటి లోతులు తెలుసుకోవ టానికి పైదేశానికి వెళ్ళిపోయేడు శేఖర్. శారదకి ఉన్న ఒక్క ఆర్తి తీర్చే ఆలం బనమూ అతనితోనే వెళ్ళిపోయింది. శేఖర్ తిరిగి వచ్చేసరికి శారద జాడే లేకుండా పోయింది. ఓ కొడుకు పుట్టేక, ఆమె తండ్రి పోయాడనీ, తండ్రి పోయేక ఇహ కృష్ణమూర్తి బాధలు తట్టుకోవల సిన అవసరం కనిపించక శారద కృష్ణమూర్తితో తెగతెంపులు చేసుకుం దనీ, ఆమెమీద కసితోతీర్చుకోవటానికి కృష్ణమూర్తి కోర్టులో ఆమెని వ్యభి చారిణిగా నిరూపించి పిల్లవాణ్ణి ఆమెకి కాకుండా చేశాడనీ, పిల్లాణ్ణి చూసి పోయేందుకు కోర్టు అనుమతించినా అతను పడనివ్వకపోవటం, ఉన్న ఊర్లో ఇంత అప్రతిష్ఠ పాలవటం భరించలేక శారద ఆస్తి అమ్మేసి ఎక్కడికి వెళు తున్నదీ చెప్పకుండా మాయమై పోయిం దనీ చెప్పింది శేఖర్ తల్లి. గుండెలు పిండే మనోవ్యథలో తను శారదని వెర్రిగా ప్రేమిస్తున్న సంగతి మొదటి సారిగా గ్రహించుకున్నాడు శేఖర్. కాని, ఏదీ శారద? ఎక్కడని వెతకటం? అయినా, శేఖర్ అన్వేషిస్తూనే ఉన్నాడు తన శారద కోసం.

ఇప్పుడు అంతమయింది తన అన్వేషణ అనుకున్నాడు శేఖర్ నిట్టూరుస్తూ. శారదని ఎలాగైనా, ఎక్కడైనా కలుసుకో గల ననుకున్నాడే గాని, ఆ కలుసుకోవటం ఇలా, ఇక్కడ అవుతుందనుకున్నాడా తను?

ఆ సాయంకాలం శారద వర్క్ చేసిన కాలేజీ ప్రిన్సిపల్ని కలుసుకున్నాడు శేఖర్.

అత నెవరో తెలుసుకున్న ఆవిడ సానుభూతితో అతని ప్రశ్నలకి సమాధానా లిచ్చింది.

"మా కాలేజీలో జాబ్కి అప్లయ్ చేసి, నన్ను కలుసుకొని క్లుప్తంగా తన జీవితం గురించి చెప్పింది శారద. పెదిమలు బిగబట్టి అదిమి పెట్టటమే కాని, ఆమె తన మనస్సున రంపపుకోత పెడుతున్న ఆలోచనలు నాతోకూడా చెప్పుకొనేది కాదు. కాని, ఒక్కొక్కప్పుడు అవి మరీ పెరిగి హింసించేవి కాబోలు, అటువంట ప్పుడు అసలు ఎవరితోనూ మాట్లాడేది కాదు. మరీ విపరీతంగా క్రుంగిపోయి, తిండీ సరిగా తినక, చివరికి పాఠాలు చెప్పటానికికూడా నోరు తెరిచి మాట్లాడా లనే ఇంక్లినేషన్ లేకుండా అయిపోతే క్లినిక్లో ఎడ్మిట్ చేశాను. కొంత బాగు పడ్డాక తిరిగి వచ్చినా మళ్ళీ పరిస్థితి దిగజారుతూనే ఉంది. ఆ పిల్ల మనసులో చిన్నప్పట్నించీ పేరుకుని మంచులా గడ్డ కట్టుకుపోయిన ఆవేదన అంతా కరిగి కన్నీ రుగా ప్రవహించాలేమో? చూశారుగా— ఇరవై నాలుగు గంటలూ అలా కన్నీళ్ళు కారుస్తూనే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు క్లాసులో సడెన్గా డిప్రెస్ అయి కన్నీళ్ళు కార్చేసేది. పిల్లలు బెంబేలు పడిపోయేవారు. ఆ స్థితిలో ఆమెని నార్మల్గా ఉంచటం పిల్లల మనసు మీద దెబ్బ తీస్తుందనే అలా వెయ్యవలసి వచ్చింది" అందామె నిట్టూరుస్తూ.

ఆ రోజంతా శారద కేసు గురించే ఆలోచించాడు. ఆమెకి షాక్స్, డ్రగ్స్, సైకోథెరపీ మాత్రం చాలవు. వీటన్నిం టితో కాస్త స్థిమితపడ్డా, తిరిగి జీవితాన్ని ఒంటరిగా ఎదుర్కోవలసి వచ్చేసరికి, ఆ ఒంటరితనంలో భవిష్యత్తు అనే పదానికి అర్థం కనుపించక, తిరిగి గతంలోకే ప్రయాణిస్తున్నది ఆమె మనస్సు. ఆ గతం ఆమెని మళ్ళీ క్లినిక్కే తీసుకు వస్తుంది. శారదని గూర్చి అన్నీ తెలిసిన తను, ఆమె బయటి ప్రపంచంలో ఒంటరి తనానికి గురి కాకుండా ఆలంబన ఇవ్వగలిగితే, ఆ కన్నీళ్ళు తన ప్రేమతో వత్తగలిస్తే ఆమె బాగుపడుతుంది. అదే మార్గమని నిశ్చయానికి వచ్చాడు శేఖర్.

మరునాడు హాస్పిటల్కి వెళ్ళి ముందు వార్డు రౌండ్స్ చెకప్, నర్సులకి ఇన్స్ట్రక్షన్సు ఇవ్వటం పూర్తిచేసి శారదని సమీ పించాడు శేఖర్. తనని చూస్తూనే ఆనందంగా లేచి వచ్చి గబగబా తన తల్లి గురించీ, కుటుంబం గురించీ వివరా లడుగుతూ ఉన్న శారదని మెంటల్ పేషంటుగా భావించలేకపోయాడు శేఖర్. అప్పట్నుంచీ రోజూ ఆమెతో కొంత సేపు కబుర్లతో కాలక్షేపం చేసేవాడు. ఆ కబుర్లలో ఆమె ఒక పేషంటనీ, తను డాక్టర్ననే భావనే కలగ నిచ్చేవాడు కాదు. ఇన్నాళ్ళకి తన్నర్థం చేసుకొనే ఒక వ్యక్తి లభించటంతో శారద మౌనానికి గట్లు తెగాయి. కృష్ణమూర్తి వల్ల తను పడ్డ బాధలూ, తన కొడుకు మనసులే లేని ఆ మనుషుల మధ్య పెరుగుతున్నాడని తలుచుకుంటే తనకి కలిగే వేదనా చెప్పుకుని కుమిలి కుమిలి ఏడ్చింది.

"వాడు అచ్చంగా మా నాన్నగారి ప్రతిరూపం, శేఖర్! ఆయన లాగే

వాడూ చాలా సెన్సిటివ్ వై పు. రక్తంలో పంచుకు వచ్చిన లక్షణాలు పోతాయంటావా? ఇంత సెన్సిటివ్‌గా ఉండే వాడు ఆ పశువుల్లాంటి మనుషుల మధ్య ఎంత చికాకు పడిపోతూ పెరుగుతాడో, ఏమో? నా మీద తనకి కసి వాడిప్పు, కన్న తండ్రిగా ఆ పసివాడి మీదకూడా అభిమానం లేకపోయిందా మనిషికి. వాడు తల్లి ప్రేమ కోసం అలమటిస్తాడేమో! అది వాడి వ్యక్తిత్వంలో వాణ్ణెంత బాధపెడుతుందో అని కూడా ఆలోచించ లేకపోయాడు" అంటూ వాపోయే ఆమెని ఓదార్చేవాడు శేఖర్.

ఒక పది రోజుల పాటు కబుర్లాడుతూనే ఆమె మనస్తత్వాన్ని పరీక్షించాడు శేఖర్. గత జీవితంలో పడ్డ బాధలతో బీటలు వేసిన మనస్సులో అనుక్షణం ఊరుతున్న వేదన తప్పితే, ఆమెకు మతి చలించలేదని తెల్సుకుని, తను చెప్పే విషయం ఆమె పూర్తిగా అర్థం చేసుకోగలదనే భరోసా కలిగాక తన నిర్ణయం శారదకి చెప్పాడు శేఖర్.

"చూడు, శారదా, నే నేదో నీ పరిస్థితికి జాలిపడి నిన్ను పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నానని మాత్రం భావించకు. చిన్నతనంనించీ కలిసి ఆడుకుని పెరిగేం కనక మనకి ఆ స్నేహభావమే నిలిచిపోయింది. నిన్ను ప్రేమిస్తున్నానని గాని, నిన్ను పెళ్ళి చేసుకుని నాదాన్ని చేసుకోవాలనే కోర్కె నాలో ఎక్కడో దాగి ఉన్నదనిగాని నేనే తెలుసుకోలేక పోయాను. నువ్వు పెళ్ళై మరొకరి సొత్తయినప్పుడు కూడా ఏదో పోగొట్టుకున్న ట్లనిపించినా, ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళటం లోటే పరాయిదవుతుంది. చిన్ననాటి స్నేహితురాలితో ఇక ఆ స్నేహం అనుభవించే స్వాతంత్ర్యం ఉండదనే గుబులుగా ఆ ఫీలింగ్‌ని ఎరిపుచ్చుకున్నాను. కాని, నువ్వు కృష్ణమూర్తి వల్ల హింస అనుభవిస్తూ శారీరకంగా, మానసికంగా చిత్రవధ కావడం చూసి బాధ గుండెల్లో రగులుకొని నన్ను కాల్చినప్పుడు కాని నా మనఃస్థితి నా కర్థం కాలేదు. అప్పుడు నీ కెలా తెలియజెప్పేది? నువ్వు మరొకరి భార్యవు. నీ వివాహ జీవితాన్ని భగ్నం చేసే అధికారం నా కుందా అనే మీమాంసలో పడి కొట్టుకుంటూనే ఫారిన్ వెళ్ళిపోయాను. నువ్వు ఎవరికీ చెప్పకుండా ఊరు వదిలి వెళ్ళిపోయావు. లేకపోతే నువ్వు కృష్ణమూర్తివి డైవోర్సు చేసిన విషయం నాకు తెలిసినట్లయితే ఫారిన్ నించి రాగానే నిన్ను పెళ్ళి చేసుకుందును. అప్పటిదాకా అనుభవించిన చిత్రహింసని నే తుడిచి పెట్టలేక పోయినా, కనీసం ఆ తరవాతైనా నువ్వు సుఖశాంతుల్తో జీవించేలా చేసేవాణ్ని."

ఆవేశంగా మాట్లాడుతున్న శేఖర్ని కళ్ళు విప్పార్చుకుని ఆశ్చర్యంగా చూట్టమే కాని, మాటాడలేకపోయింది శారద. ఆమె కళ్ళలో కదులుతున్న భావాలని అర్థం చేసుకోలేక పోయాడు శేఖర్.

"ఏం, శారదా, నా దగ్గరకూడా మౌనవ్రతమేనా? ఏ నీ, నోటితో చెప్పలేకపోతే కొద్దిసేపా కన్నీళ్ళకి బదులు చిరునవ్వులు చిందించు. నీ జీవితంలో ఇక మీదట అలాగే చిరునవ్వు చిందేలా చెయ్యగలననే ధైర్యం, భరోసా వస్తాయి నాకు" అన్నాడు శేఖర్.

శారద పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి. వజ్రాల నిధి దొరికినట్లు సంబరపడి పోయాడు శేఖర్.

"అది! అలా ఉండాలి శారదంటే. జ్ఞాపకం ఉందా, శారదా? నువ్వెప్పుడూ విరగబడి కాని, కిలకిల కాని నవ్వేదానివి కావు కాని, ఆ చిరునవ్వుమాత్రం ఎప్పుడు నీ పెదిమల మీంచి మాయమయేది కాదు. నీ కంట కన్నీరు అలా కారటం చూసి నే నెలా భరించగలను చెప్పు? తిరిగి మునపటి శారదలా నువ్వు చిరునవ్వు చిందే మొహంతో నా ఇంట్లో ఆనందంగా తిరుగాడాలి. అలాగని నీ బాధ నే నర్థం చేసుకోలే ననుకోకు. నీ జీవితం అంతా తెలిసి నేనుకూడా నీ మనసులోని ఆవేదన అర్థం చేసుకోలేకపోతే ఇంకెవరు చేసుకుంటారు? ఆ బాధని కన్నీరుగా కార్చవలసిన అవసరం కలిగినప్పుడు నేను నీ చేరువనే ఉంటాను. అవి నా గుండెల్లోనే ఇంకిపోనీ. కాని, నువ్వు ఎప్పుడూ ఇలా పరితపిస్తూనే గడపడం నే భరించలేను. నవ్వు, శారదా. జీవితంలో నవ్వే నోచుకోకుండా చేస్తాడా భగవంతుడు నీకు? నిన్ను నేను నవ్వుల పూలతగా మార్చ దలుచుకున్నాను" అంటూ ఆమె చేతిని మృదువుగా నొక్కాడు శేఖర్. మోనాలిసా పెదిమలపై ఉండీ ఉండనట్లనిపించే ఇన్‌స్క్రూటబుల్ స్మైల్ శారద పెదవులపై నడయాడింది.

ఆ మరునాటినుంచీ శారద కన్నీరు కార్చటం ఎవరూ చూడలేదు. జీవితం తిరిగి ఒంటరిగా ఫేస్ చేయనక్కర లేదనీ, తిరిగి ఆనందంగా గడిపే జీవితం గడిపే అవకాశం కలుగుతుందనీ, భవిష్యత్తనే పదం అర్థంలేని, ఆలంబనం లేని చీకటి జీ భూతం కాదని ఆమె కర్థమయేలా చేస్తే ఆమె డిప్రెషన్స్ తగ్గుతాయని తెలిసిన శేఖర్‌కే ఆమె అంత త్వరగా మారటం ఆశ్చర్యాన్ని కలిగించింది. కాని, ఆమె ఎంత త్వరగా రికవర్ అయితే అంత త్వరగా ఈ వాతావరణంలోంచి తప్పించి తీసుకు వెళ్ళవచ్చని సంతోషించాడు.

**జీవితంలో కొంచెం ముందుకు వెళితే, ప్రపంచంలోని ఘోరాలన్నింటికీ కారణం మనిషి నాలుకే ననిపిస్తుంది.**

**—పాకిస్తాన్ హుడ్**

రోజూ వీలైనంత సేపు ఆమెతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేసేవాడు. చిన్ననాటి కబుర్లు చెప్పి నవ్వించే వాడు. త్వరలో ఆ నరకం నించి బయటపడి తాము పెళ్ళి చేసుకున్నాక జీవితం ఎంత సరదాగా గడుస్తుందో ఓ రంగుల కలలా ఆమె కళ్ళ ముందు చిత్రించే వాడు. సాధ్యమైనంత వరకు ఆమెకి బాధ కలిగించే ఏ విషయమూ రానివ్వక, భవిష్యత్తు మీద ఆశ ఆమె మనస్సులో కలిగించాలి. ఇదే తపన శేఖర్‌కి.

శారదకి శేఖర్ ట్రీట్‌మెంట్ ఆరంభించి నెల కావస్తోంది. మునుపట్లా కన్నీళ్ళధారలతో కనిపించడం మానేసిందామె. నవ్వని చిరునవ్వుతో, విచ్చుకున్న పెదాలతో ముగ్ధమోహనమూర్తిలా కనపడేది ఎప్పుడూ. ఇంకో వారంలో కొన్ని టెస్టులు చేయించి డిస్చార్జి ఆర్డరు పుచ్చుకోవచ్చనే ధైర్యంతో ఉన్నాడు శేఖర్.

ఆ రోజు తన జీవితంలో మరిచిపోలేదు శేఖర్. హాస్పిటల్ సూపరింటెండెంటుతో మాట్లాడి శారద జీవితమంతా వివరించి, ఇప్పు డామె ఇంప్రూవ్ అవటానికి కారణమూ, తన నిర్ణయమూ చెప్పాడు. ఎంతో హర్షించా డాయన.

"ఐయామ్ సో గ్లాడ్, మై బోయ్! ఇన్ గెటింగ్ ది గర్ల్ ఆఫ్ యువర్ లవ్, యూ ఆర్ గివింగ్ న్యూ లైఫ్, టు ఎ స్టార్మ్ టాస్‌డ్ లైఫ్. నీ నిర్ణయం హర్షించదగినదీ, అభినందించదగిన దీనూ. ఐ బ్లెస్ యు బోత్ ఫ్రమ్ ది బాటమ్ ఆఫ్ మై హార్ట్. సాధ్యమైనంత త్వరలో ఆమె డిస్చార్జికి ఏర్పాట్లు చేయిస్తాను. విష్యూ గుడ్‌లక్!" అంటూ భుజం తట్టి పంపించేరు. ఉప్పొంగిపోతున్న మనస్సుని అదుపులో పెట్టుకుంటూ తన రూమ్‌లోకి నడిచాడు శేఖర్. టేబిల్ మీద ఒంటరిగా ఎదురు చూస్తున్న ఓ కవరు అతని కంట పడింది. ఆ కవరుమీద 'రాజశేఖర్' అని ఉన్న అక్షరాలు శారదవి కాదూ? ఆత్రంగా కవరు చించాడు. తెల్లటి కాగితాలపై నల్లని అక్షరాలను, ఒక్కొక్కటిగా చదువుతూ ఉండగా అతని గుండెల్లోకి చొచ్చుకొనిపోయి అక్కడ ఇంకిపోయే ఆమె కన్నీళ్ళకు బదులుగా.

తనతో మాటాడి వెళ్ళిన అరగంటకే తిరిగి తన గదిలోకి వచ్చిన శేఖర్ని ఆశ్చర్యంగా చూశారు సూపరింటెండెంట్.

"ఎస్, మై బోయ్?" అన్నారు ప్రశ్నార్థకంగా.

మాటాడకుండా ఓ కవరు ఆయన టేబిల్ మీద పెట్టి, నిలునోనటానికి శక్తి లేక కుర్చీలో కూలబడ్డాడు శేఖర్. అతని పాలిపోయిన మొహం చూసి గాభరా పడ్డారు ఆయన.

"ఏమిటిది?" అంటూ కవరు తెరిచిన ఆయన మొహం అందులో ఉన్న సింగిల్ షీట్‌మీదున్న నాలుగు వాక్యాలు చదవగానే జేవురించింది.

"వాటీస్ దిస్? హావ్ యూ గాన్ ఔటాఫ్ యువర్ సెన్సెస్? ఈ రేజిగ్నేషనేమిటి?" శేఖర్ని కుదిపేసే డాయన. "స్పీక్ ఐసే. యూ లుక్ లైక్ ఎ షాక్ కేస్. ఏమైందీ?"

"నే నేమీ చేప్పే స్థితిలో లేను, సర్, ఇది చదవండి." జేబులో నించి శారద ఉత్తరం తీసి ఆయన చేతిలో పెట్టి కుర్చీలో వెనక్కి వాల్చబడి పోయాడు. ఉత్తరం విప్పా రాయన.

"శేఖర్,

నా జీవితంలోని ప్రతి ఘట్టమూ తెలిసిన వాడివి నువ్వు. సైకియాట్రీ అవసరమే లేదు నీకు, నాలో సముద్రంలో అలల్లా పొంగి పొర్లే భావాలని అర్థం చేసుకోవటానికి ఒక్కొక్కప్పుడు మెదడు లోపలి భాగంలోంచి ఏదో ద్రవం వేడిగా, అలలు అలలుగా కపాలం మీద కొడుతున్నట్లుంటుంది. అది తలనొప్పి కాదని నాకు తెలుసు. పదివత్సరాలుగా పొరలు పొరలుగా పేరుకుపోయిన ఆలోచనలవి. అవి నన్ను మెత్తల్స ... ఉంటాయి.

బాధ పడ్డానికే జన్మెత్తానేమో నేను! ఈ జన్మలోకి ఓ బొట్టు సంతోషం రాల్చాలని పూనుకున్నావు నువ్వు. నోరు తెరిచి ఆ ఒక్క బొట్టు అమృతాన్ని కూడా రుచి చూసే అదృష్టం లేని అభాగ్యురాలిని నేను.

నాన్నగారి కోసం, అమ్మ కోసం నా కన్నీటిని దిగమింగి అనుక్షణం అనురాగం కోసం అలమటించే మనసుని అదుపులో పెట్టుకుంటూ పెరిగాను.

కృష్ణమూర్తిని పెళ్ళి చేసుకున్నాను శేఖర్! ప్రేమించే పెళ్ళి చేసుకున్నాను. అతను పెట్టే చిత్రాకులు నాన్నగారికి తెలియకూడదని దెబ్బలు శరీరంలోకీ, కన్నీళ్ళు గుండెల్లోకీ ఇంకించుకుని బతికాను. రాత్రిళ్ళు తలగడాలో మొహం దూర్చి ఏడిస్తే, 'కాలేజీలో నీ అందం చూసి ముగ్ధిసిపోయి చేసుకున్నాను. ఇంట్లో ఎప్పుడూ ఇలా ఏడుపు మొహం



నీడలేని ప్రాణులు — చిత్రం— ఇ. గోపాలరావు (పొన్నెకల్లు)

తగలడతావేం? నీ అందమంతా ఆ కాలేజీలోని వెధవలందరికోసమా?' అని మరీ వాలుగు తన్నేవాడు.

అత్తవారింట్లో ఇంక దేనికి నోచుకో లేకపోయినా కనీసం ఏడవటానికీ నోచుకున్నాను. మా బావగార్లు తన్నటం, మా తోడికోడళ్ళు పెడగొబ్బలు పెట్టి మరీ ఏడవటం అందరికీ మామూలే. కానీ, అక్కడా నా కన్నీళ్ళకి చోటు లేకపోయింది. మా బావగార్లంతగా చదువుకున్న వాళ్ళు కాదు. 'నేను ఎమ్. ఎ. చదువుకున్నాను. ఇంత చదువుకునీ పెళ్ళాన్ని అరడి పెడుతున్నాడని మా వాళ్ళందరికీ తెలియాలనా నీ ఉద్దేశం? కిక్కురుమన్నా, కింట్లో తడి కనిపించినా ఎముకలు విరుగుతాయి జాగ్రత్త' అని గుడ్లనీరు గుడ్ల కుక్కించేవాడు కృష్ణమూర్తి.

ఈ ఊరు వచ్చాను. ఒంటరితనం. జ్ఞాపకాలే స్నేహితులు. 'అమ్మా' అనే వాడి గొంతుక ఎంత మందిలో ఉన్నా నాకు వినిపిస్తూనే ఉంటుంది. కన్నీళ్ళం మళ్ళీ ఆ కన్నీళ్ళకు కారే అధికారం లేదు. బాధపడ్డానికి నాన్నగారు లేరు. ఏడ్వటానికి కృష్ణమూర్తి లేడు. చూసి బెంబేలు పడ్డానికి నా బిడ్డ లేడు. కాని, నా కన్నీరు కార్చటానికి మాత్రం పెర్మిషన్ దొరకలేదు, రాజూ! ఏ క్లాస్‌రూమ్‌లో లెక్చరిస్తున్నప్పుడో, స్టాఫ్ రూమ్‌లో ఉన్నప్పుడో జ్ఞాపకాలు వచ్చి బాధ పెట్టేవి. గుండెల్లోని బాధ కళ్ళలోకి ఉబికేది. కాని, అలా అడ్డ దిడ్డంగా, అర్థం పర్థం లేకుండా కన్నీళ్ళు కారిస్తే వింతగా చూస్తారందరూ. ఆపుకొనేదాన్ని. పెదవులు నొప్పెడుతూ ఉంటే వెక్కిళ్ళతో బాటు ఆ కన్నీళ్ళనీ దిగమింగేదాన్ని. కాలేజీ అయ్యాక రూమ్‌లో నే ఒక్కర్తెనేగా? అప్పుడు మనసుతీరా కార్చవచ్చనుకునే దాన్ని. కాని, రూముకి చేరేసరికి కళ్ళు పొడారి పోయేవి. కన్నీళ్ళు ఎప్పుడొస్తే అప్పుడు కార్చెయ్యాలి, శేఖర్! కాని, సంఘం సరౌండింగ్స్‌దాని కవకాశమివ్వవు. మై టియర్స్ ఆల్వేస్ కేమ్ ఎట్ ఆడ్ టైమ్స్ ఆడ్ ప్లేసెస్. వెన్ ది టైమ్ ఎండ్ ప్లేస్ వజ్ దేర్, దే రిసీడెడ్ చెయ్యమంటావు? తగిన ఏం సమయమూ, సందర్భమూ చూసుకుని రావటం లేదు నా కన్నీళ్ళు.

నిన్ను పెళ్ళి చేసుకుంటే నా బతుకులోకి మళ్ళీ ఆనందం రావచ్చు. నువ్వు నన్నెంత ప్రేమిస్తున్నావో అర్థం చేసుకున్నాను నేను. మా నాన్నగారు అమ్మ మీద నింపుకున్న ఆరాధన ఆదర్శం నాకు. ఆ ఆరాధన నీలో ఉంది. కాని, చాలా లోతుగా బీటలు వారిన గుండె నాది, శేఖర్! కృష్ణమూర్తిని ప్రేమించేనని, చెప్పాను కదూ? జీవితం గూర్చి కన్న కలలు అతని కళ్ళలోకి చూస్తూ నిజం చేసుకోవాలని వెర్రిగా ప్రేమించాను. ఆ ప్రేమని అణువులుగా మార్చి ఒక్కొక్క అణువూ విడివిడిగా చంపాడు కృష్ణమూర్తి. విపరీతంగా ప్రేమించిన ఓ వ్యక్తిని విపరీతంగా అసహ్యించుకోవాలంటే హృదయం ఎంత గాయపడాలో ఊహించుకో గలవా నువ్వు? అంత లోతుగా దిగిన గాయాలు మానుతాయా? నా కొడుకుని నా నించి విడదీశాడే కాని కృష్ణమూర్తి—వాడి జ్ఞాపకాలని విడదీసి తీసుకుపోలేదే? వాడు ఎక్కడో ఒంటికో, మనసుకో దెబ్బ తగిలినప్పుడల్లా 'అమ్మా' అని ఏడుస్తాడనీ, నా కోసం వెతుక్కుంటాడనీ తలుచుకుంటే విలవిల్లాడే నా గుండెలోని బాధని ఎలా వివరించను? ఆ జ్ఞాపకాలు వస్తూ ఉంటాయి. నా కళ్ళు నీళ్ళు వర్షిస్తాయి. నా కళ్ళలో నీళ్ళూ, గుండెల్లో బాధా భరించలేవు, చూడ లేవు నువ్వు. నన్నింత ప్రేమించే నిన్ను బాధ పెట్టలేను నేను. తిరిగి కన్నీళ్ళు మింగటం ఆరంభించాలి. పైగా ఈ జ్ఞాపకాలు రావటానికి ప్రత్యేకించి ఏ టైమంటూ లేదుగా? వీలుండదు. తిరిగి ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడనే ఏడవటానికి వీలుండదు. నీ సోషల్ లైఫ్ ఏమయ్యేట్టు? ఎప్పుడో నీ గుండెల్లో తల దూర్చుకుని ఏడవటానికి అవకాశం లభించినప్పుడు అవి రాకపోవచ్చు. వద్దు, శేఖర్, వద్దు. ఈ నరకయాతన నాకూ, నా నుంచి నీకూ వద్దు.

ఇన్నాళ్ళకి నా కన్నీళ్ళ కో చోటు దొరికింది. ఎందు కేడుస్తుందని వింతగా చూడరెవ్వరూ ఇక్కడ. ఇంకెక్కడా లేని స్వాతంత్ర్యం, శాంతి ఇక్కడ దొరికాయి నాకు. అందుకే రెండు సార్లు రీఅడ్మిట్ అయ్యాను. బయట ప్రపంచంలో నాకు మాత్రమే చోటుంది, శేఖర్! నా జ్ఞాపకాలకీ, కన్నీళ్ళకీ లేదు. అవే నా స్నేహితులు. 'హంకో అప్నాసాయాతక్ అక్సర్ బేజార్ మిలా—' అదే నా జీవితం. ఈ జీవితం పంచుకొనే తీరిక ఈ స్నేహితులకే ఉంది.

నన్నింత ప్రేమిస్తున్నావు. నా కోసం ఓ త్యాగం చెయ్యగలవా, శేఖర్? ఇంత కఠినమైన. క్రూరమైన కోరిక కోరుతున్నా, ఎంత బండబారిన గుండె నాది? రిజైన్ చేసి ఇక్కణ్నించి వెళ్ళిపో నువ్వు. నువ్విక్కడ ఉంటే ఇక్కడా నా కన్నీళ్ళకి చోటు ఉండదు. ఈ శారదని మరిచిపో. ఇన్నాళ్ళకి నా కన్నీళ్ళ కో చోటు దొరికింది. ఈ చిన్ని చోటు నా కొదిలెయ్, శేఖర్! మిగతా ప్రపంచమంతా నా కక్కర్లేదు.

విధి కాలేని...

—నీ శారద."

పిచ్చిగా కిటికీలోంచి పొగడ చెట్టు కింద కూర్చున్న శారదని చూస్తూ కూర్చున్న శేఖర్ భుజం మీద చెయ్యి వేశా రాయన. గొంతుకలో ఏదో అడ్డు పడ్డట్టు మాట రాలే దాయనకి. శేఖర్ రెజిగ్నేషన్ మీద "ఆక్సెప్టెడ్" అని గిలికేసి, కిటికీ దగ్గరకి వెళ్ళి తనూ కన్నీళ్ళు కారుస్తున్న ఆ రూపాన్ని చూస్తూ ఉండిపోయారు. ★